క్లుప్తంగా

పారిశుధ్య కార్మికురాలికి నివాళి



మృతురాలి కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న దృశ్యం

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు పరిధి పారిశుధ్య కార్మికురాలు తుపాకుల గౌరి (50) అనారోగ్యంతో గురువారం మృతి చెందడంతో, సహచర కార్మికులు ఆమెకు నివాళులర్పించారు. అవుట్‌సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్మ శ్రీనివాసరావు సమకూర్చిన రూ.15వేలు నగదును శానిటరీ ఇన్‌స్పెక్టర్ అందించారు. అధికారులు సమయం లేదని కనీసం మృతదేహాన్ని చూసేందుకు కూడా రాలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. దహన సంస్కార ఖర్చులు ఏఎంహెచ్‌వో ద్వారా ఇవ్వాల్సి ఉండగా, వీరి జాడే లేదని కుటుంబ సభ్యులు వాపోయారు.

ఏఎంసీ డైరెక్టర్‌కు అభినందనలు



ఏఎంసీ డైరెక్టర్ శివశంకర్‌ను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

గోపాలపట్నం: వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా వ్యవసాయదారుల సంక్షేమానికి కృషి చేయాలని విశ్వశాంతి సంక్షేమ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి, న్యాయ సలహాదారుడు చెవ్వేటి జీవన్‌కుమార్ కోరారు. ఇటీవల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా పదవి పొందిన స్థానికుడు ఉప్పాటి శివ శంకర్‌ను 91వ వార్డు రామకృష్ణానగర్‌లో గురువారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోనాల జీవన్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి



కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ సేవా పథకం అధికారులు, తదితరులు

మల్కాపురం : యువత మత్తు పదార్థాలకు, మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) జిల్లా నోడల్ అధికారి ఈ.పి.ఎస్. భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల వద్ద ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం జరిగిన అంతర్జాతీయ మత్తు పదార్థాల, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ స్నేహితుల ఒత్తిడి, మానసిక సమస్యల వల్ల యువత మత్తు పదార్థాలకు అలవాటు పడుతున్నారని వివరించారు. దీనివల్ల అనారోగ్య సమస్యలతో పాటు, సమాజంలో చెడ్డ పేరు, తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితులు ఎదురవుతాయన్నారు. మానసిక ఒత్తిడిని జయించడానికి అనేక మార్గాలు ఉన్నాయని, మత్తు ఒక్కటే పరిష్కారం కాదని ఆమె స్పష్టం చేశారు. మత్తు పదార్థాల వాడకం నేరాలకు, ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. తల్లిదండ్రుల ఆవేదనను అర్థం చేసుకుని, యువత మత్తుకు బానిస కాకుండా మంచి అలవాట్లపై దృష్టి సారించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఈగల్ క్లబ్ సభ్యులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సాయి మందిరంలో పూజలు



సాయిబాబా

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలోని మహాత్మా గాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో కొలువుదీరిన సద్గురు షిర్డీ సాయిబాబా ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు ఘనంగా జరిగాయి. ఉదయం 6 గంటలకు బాబాకు హారతి పూజ నిర్వహించిన అనంతరం, విభూది, పంచామృతాలతో అభిషేకాలు చేపట్టారు. పలువురు భక్తులు బాబా నామాన్ని స్మరిస్తూ భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం బాబాకు పల్లకీ సేవతో పాటు, బాబా పాదుకలను పురవీధులలో ఊరేగింపు నిర్వహించారు.



బుచ్చిరాజుపాలెంలోని ఆన్‌లైన్ పరీక్ష కేంద్రం



రోడ్డు మధ్యలో డివైడర్‌లో కూర్చున్న అభ్యర్థులు

సౌకర్యాలు ఇలాగేనా..?

- ఆన్‌లైన్ పరీక్ష కేంద్రం వద్ద అవస్థలు
- రోడ్డుపైనే బంధువులు పడిగాపులు
- పార్కింగ్ నదుపాయం లేక రోడ్డుపైనే వాహనాలు



ప్రమాదభరితంగా ఉన్న జనరేటర్



కేంద్రం వద్ద టెంటు ఇలా

విశాఖ విద్య: పోటీ పరీక్షలతో పాటు, వివిధ కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన పరీక్షలు ఆన్‌లైన్‌లో జరుగుతున్న ఈ తరుణంలో ఎన్ఏడీ సెంటర్‌కు సమీపంలోని బుచ్చిరాజుపాలెంలో ఉన్న ఏ.డీ.జెడ్. ఆరోవనా డిజిటల్ జోన్‌లో సౌకర్యాల కొరత తీవ్రంగా ఉందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరీక్షా కేంద్రం వద్ద సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. పరీక్షకు వచ్చే వందలాది మంది అభ్యర్థులు, వారికి తోడుగా వచ్చే వారంతా తమ వాహనాలను రోడ్డు పక్కన నిలుపుతున్నారు. పార్కింగ్ లేకపోవడంతో, అభ్యర్థులు రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లపై కూర్చొని పరీక్ష సమయం కోసం వేచి ఉంటున్నారు. ఈ కేంద్రం ఉండే ప్రాంతం ఎన్ఏడీ–బిర్లా జంక్షన్ నుంచి సింహాచలం వైపు వెళ్లే రద్దీ రహదారి కావడంతో, నిత్యం వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు

ఆన్‌లైన్ పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసే సమయంలో అధికారులు ఇలాంటి మౌలిక సమస్యలను గుర్తించడంలో విఫలమయ్యారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించేలా నిర్వాహకులకు సరైన ఆదేశాలు ఇవ్వాలని, లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, బుచ్చిరాజుపాలెంలోని ఆరోవనా డిజిటల్ జోన్‌తో పాటు ఇతర పరీక్షా కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గాలికి కూలిపోయేలా టెంట్లు

పరీక్ష కేంద్రం నిర్వాహకులు అభ్యర్థుల సౌకర్యాల కోసం తగిన శ్రద్ధ చూపడం లేదని అభ్యర్థులు విమర్శిస్తున్నారు. పరీక్ష కేంద్రం వద్ద కేవలం ఒక చిన్న టెంట్‌ను మాత్రమే ఏర్పాటు చేశారు. అది కూడా గాలి దుమారం లేదా వర్షం వచ్చినప్పుడు ఒరిగిపోయేలా, ఎప్పుడు కూలిపోతుందో తెలియని స్థితిలో ఉంది. దీంతో అభ్యర్థులు ఆ టెంట్ కింద నిలబడలేక, రోడ్డుపైనే వేచి ఉండాల్సి వస్తోంది. పరీక్షలు సక్రమంగా పూర్తయితే చాలనే ధోరణిలో నిర్వాహకులు వ్యవహరిస్తున్నారని, అధికారులకు కూడా ఈ సమస్యలపై దృష్టి సారించడం లేదని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్తపాలెంలో ఆకతాయిల బెడద



కొత్తపాలెం జంక్షన్‌లో పరిస్థితిని విచారిస్తున్న గోపాలపట్నం సీఐ ప్రభాకర్ తదితరులు

గోపాలపట్నం : జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం ప్రాంతంలో ఆకతాయిల బెడద అధికంగా ఉందని, వారి వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఇక్కడ ఉన్న మద్యం దుకాణం ఎదురుగా ఉన్న అక్రమ దుకాణాలు ఆకతాయిలకు అడ్డాగా మారాయని స్థానికులు వాపోతున్నారు.

ఈ సమస్యపై స్థానికులు ముఖ్యమంత్రి కార్యాలయానికి నేరుగా ఫిర్యాదు చేశారు. సీఎం కార్యాలయం నుంచి సమాచారం అందడంతో, టౌన్ ప్లానింగ్ అధికారులు, పోలీసులు హడావుడిగా వచ్చి తనిఖీలు నిర్వహించి వెనుదిరిగారు. అయితే అక్కడి దుకాణాలను తొలగించకుండా కేవలం ఫొటోలు తీసుకుని వెళ్లిపోయారని, 'తమ పని అయిపోయిందన్నట్లుగా' వ్యవహరించారని స్థానికులు విమర్శిస్తున్నారు.

రాజకీయ ఒత్తిడి, బెదిరింపులు

ఫిర్యాదు అందిన వెంటనే స్థానిక అధికారులు టీడీపీ నాయకులకు సమాచారం అందించడంతో రాజకీయ ఒత్తిళ్లు మొదలయ్యాయని, ఫిర్యాదుదారులను బెదిరించడం, వారిపై ఒత్తిడి తేవడం వంటివి జరుగుతున్నాయని బాధితులు చెబుతున్నారు. నాయకుల సూచనల మేరకు అధికారులు దుకాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా, కేవలం తూతూమంత్రంగా హడావుడి చేసి వెళ్ళిపోయారని వారు ఆరోపిస్తున్నారు.

రైల్వే స్థలాల ఆక్రమణ, అద్దెల దందా

కొత్తపాలెంలోని దుకాణాలు ఎక్కువగా రైల్వే స్థలాలను ఆక్రమించి నిర్మించినవేనని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలామంది అక్రమంగా దుకాణాలు నిర్మించి వాటిని అద్దెలకు ఇచ్చి సొమ్ము చేసుకుంటున్నారని, నిజంగా వ్యాపారం కోసం సొంతంగా దుకాణం నడుపుతున్నవారు ఒకరో ఇద్దరో మాత్రమే ఉన్నారని అంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్థానిక నాయకుల అండదండలతో ఈ అక్రమ దుకాణాల సంఖ్య మరింత పెరిగిందని, అధికారులు కూడా వారికి సహకరిస్తున్నారని సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నిఘా పెంచుతాం: సీఐ ప్రభాకర్

ఈ సమస్యపై గోపాలపట్నం సీఐ ప్రభాకర్ స్పందిస్తూ, ఆకతాయిల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రాంతంలో నిఘా పెంచుతామని, డ్రోన్లతో పర్యవేక్షించి బహిరంగంగా మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కొత్తపాలెంలో నెలకొన్న పరిస్థితిని పరిశీలించామని, త్వరలోనే మార్పు తీసుకొస్తామని ఆయన హామీ ఇచ్చారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మల్కాపురం: స్థానిక ఐఎన్ఎస్ సర్కార్ సమీపాన గురువారం ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు సుమారు 60 సంవత్సరాలు ఉండవచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. మల్కాపురం పోలీస్ స్టేషన్ అధికారుల తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం ఐఎన్ఎస్ సర్కార్ వద్ద ఫుట్‌పాత్‌పై ఒక వ్యక్తి మృతదేహం పడి ఉందని తమకు సమాచారం అందింది. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు గత కొంతకాలంగా మల్కాపురం చుట్టుపక్కల ప్రాంతాల్లో తిరుగుతూ ఉండేవాడని స్థానికులు చెబుతున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిస్తే మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు ఒక ప్రకటనలో కోరారు.

పార్టీ బలోపేతానికి సమష్టి కృషి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసుకునేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ కోరారు. జీవీఎంసీ 57వ వార్డు ఐటీఐ జంక్షన్ పరిధి తుమ్మడిపాలెంలో గురువారం నిర్వహించిన పార్టీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న ఆయన పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో వైఎస్సార్‌సీపీకి చెందిన కార్పొరేటర్ (ముర్రు వాణి)ను ప్రజలు గెలిపించుకుంటే, ఆమె పార్టీకి నమ్మకద్రోహం చేసి, వేరే పార్టీలోకి వెళ్లిపోయారన్నారు. అటువంటి వెన్నుపోటుదారులకు ఏ పార్టీలోనూ విలువ ఉండదని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల్లో ఆదరణ ఉందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఒకే తాటిపై ఉండి, వార్డులో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. దానికి కావలసిన దన్ను, ధైర్యం పార్టీ తరఫున అందరికీ ఉంటుందన్నారు. ఇటీవల నామినేటెడ్ పదవులు పొందిన పార్టీ నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు. వారందరూ వార్డులో బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అప్పలరాజు, ధనరాజు, శ్రీనివాస్, ఉమామహేశ్వరరావు, శ్రీను, మహేష్, గణేష్, గోవిందు, వీరబాబు, అప్పు, మహిళా నాయకులు శరగడం వెంకటలక్ష్మి, చిన్నారి, కమలమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోర్టు స్థలం ప్రజా అవసరాలకు కేటాయించాలి



ప్రభుత్వ విప్ గణబాబుకు సమస్య వివరిస్తున్న గ్రామ కమిటీ ప్రతినిధులు

మల్కాపురం : జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం శివారు ప్రాంతం, ప్రకాశ్‌నగర్‌కు వెళ్లే మార్గంలో విశాఖ పోర్టుకు చెందిన సుమారు 4.80 ఎకరాల భూమిని ప్రజల అవసరాలకు కేటాయించాలని మల్కాపురం గ్రామం అభివృద్ధి కమిటీ ప్రతినిధులు కోరారు. గురువారం ప్రభుత్వ విప్ పి. గణబాబును కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గత 50 ఏళ్లుగా ఖాళీగా ఉన్న ఈ స్థలంలో ఎటువంటి అభివృద్ధి జరగలేదని, దీంతో కొందరు దీనిని డంపింగ్ యార్డుగా, పాత భవనాల వ్యర్థాలను డంప్ చేయడానికి, పశువులను కట్టడానికి ఉపయోగిస్తున్నారని కమిటీ ప్రతినిధులు తెలిపారు. దీనివల్ల చుట్టుపక్కల నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ స్థలానికి అతి సమీపంలో కోస్టుగార్డ్ హెడ్‌క్వార్టర్ ఉందని, వారు ఈ స్థలాన్ని తమ అవసరాల కోసం తీసుకోవాలని ఆలోచిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు ఆరోపించారు. అయితే ఈ విలువైన, విశాలమైన స్థలంలో మల్కాపురం గ్రామస్తులకు ఉపయోగపడే విధంగా క్రీడా మైదానం, వాకింగ్ పార్కు, చిల్డ్రన్ పార్కు వంటి ప్రజా అవసరాలకు ఉపయోగపడే విధంగా అభివృద్ధి చేపట్టాలని వారు కోరారు. పోర్టు వారికి వేరేచోట జీవీఎంసీ స్థలం కేటాయించి, ఈ స్థలాన్ని తీసుకొని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వ విప్ సానుకూలంగా స్పందించారని గ్రామాభివృద్ధి కమిటీ ప్రతినిధులు భోగవల్లి నాగభూషణం, సత్యాల మహేష్ పాత్రుడు, పట్నాల పెంటారావు, మజ్జి రమేష్‌పాత్రుడు తెలిపారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష

డాబాగార్డెన్స్: వచ్చే నెల 9న సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణకు సంబంధించి జీవీఎంసీ ప్రజారోగ్య విభాగం చేపట్టాల్సిన ఏర్పాట్లపై ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ గురువారం తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో సమీక్షించారు. గిరి ప్రదక్షిణలో లక్షలాదిమంది భక్తులు పాల్గొంటారని, అందుకు జీవీఎంసీ పారిశుధ్యం, మరుగుదొడ్లు, దోమల నియంత్రణ వంటి వాటిపై తీసుకోవల్సిన జాగ్రత్తలపై జీవీఎంసీ సహాయ వైద్యాధికారులు, శానిటరీ సూపర్‌వైజర్లు, పీఎంయూ సిబ్బందికి తగు సలహాలు, సూచనలు చేశారు. భక్తులు నడిచే దారి పొడవునా పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసేందుకు రూట్ మ్యాప్ ఏర్పాటు చేసి, ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ బయాలజిస్ట్ విభాగం అవసరమైన చోట్ల దోమల నివారణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

కూటమి వైఫల్యాలను నిలదీయండి



59వ వార్డు నాయకులతో మాట్లాడుతున్న మళ్ల విజయప్రసాద్

మల్కాపురం : వార్డు పరిధిలోని ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించాలని అలాగే కూటమి నాయకుల భూ దందాలు, కబ్జాలు వంటి అంశాలను అడ్డుకోవాలని వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్ 59వ వార్డు పార్టీ నాయకులకు సూచించారు. గురువారం మళ్ల క్యాంప్ కార్యాలయం వద్ద వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో మళ్ల విజయప్రసాద్‌ను కలిసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కూటమి నాయకులు చెప్పిన మాటలు నమ్మి ఓట్లు వేసిన ప్రజలకు ఏడాదిగా చేసిందేమీ లేదని విమర్శించారు. ఉచిత గ్యాస్, ఉచిత బస్సు, తల్లికి వందనం వంటి పథకాలు కొందరికే పరిమితమయ్యాయని, నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం వంటి సూపర్ సిక్స్ పథకాలన్నీ అట్టర్ ఫ్లాప్ అయ్యాయని ఆయన ఆరోపించారు. నియోజకవర్గంలో కూటమి నాయకులను నాయకులను ప్రశ్నించాలని మళ్ల సూచించారు. తమ వార్డు పరిధిలోని పేద ప్రజలకు న్యాయం జరిగే విధంగా వ్యవహరించాలని, అదేవిధంగా వార్డు స్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ, యూత్ నాయకులు సంపత్ కుమార్, ఖాన్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

యువత మంచి మార్గంలో నడవాలి



నో డ్రగ్స్ అనే అక్షర రూపంలో విద్యార్థులు

మల్కాపురం : మాదక ద్రవ్యాల సేవనం యువత జీవితాలను ఎలా నాశనం చేస్తుందో వివరిస్తూ, వాటికి దూరంగా ఉండాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు లక్కీ అమర్ స్కూల్ ప్రిన్సిపాల్ వాసుదేవరావు. మాదక ద్రవ్యాల వ్యతిరేకం దినం సందర్భంగా 58వ వార్డు పిలకవానిపాలెం వద్ద ఉన్న లక్కీ అమర్ పాఠశాలలో గురువారం ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ వాసుదేవరావు మాట్లాడుతూ, "మత్తు మన జీవితాన్ని చిత్తు చేస్తుంది" అని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే నష్టాలను, అనారోగ్య సమస్యలను ఆయన విద్యార్థులకు వివరంగా వివరించారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు లావేటి కృష్ణారావు మాట్లాడుతూ, డ్రగ్స్ సేవించడం వల్ల యువత జీవితం ఎలా నాశనమవుతుందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బరి తెగిస్తున్న మందుబాబులు



చెరుకు రసం బండి వద్ద మందుబాబులు

మల్కాపురం : మల్కాపురం సేవా మార్గంలో పారిశ్రామిక ప్రాంత పరిధిలో ఎక్కడా లేని విధంగా ఒకే చోట వరుసగా నాలుగు మద్యం దుకాణాలు, ఒక బార్ ఉండటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఈ పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పలువురు పగలు, రాత్రి అనే తేడా లేకుండా బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా, కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత పారిశ్రామిక నగరంలో మద్యం విక్రయాలు విపరీతంగా పెరిగాయని, దీనికి అడ్డుకట్ట వేసేవారు కరువయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా జరిగిన ఒక సంఘటన దీనికి నిదర్శనంగా నిలుస్తుంది. గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో, మల్కాపురం వద్ద గల ఒక చెరుకు రసం బండి దగ్గర కొందరు వ్యక్తులు బహిరంగంగా మద్యం బాటిల్‌తో కనిపించారు. వీరు ఆ బండిని తాత్కాలిక బార్‌గా మార్చుకుని మద్యం సేవించారు. ఇంతకు ముందు సులభ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయని స్థానికులు గుర్తు చేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలగడమే కాకుండా, సామాన్య ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి, బహిరంగ మద్యం సేవనాన్ని అరికట్టాలని, అవసరమైతే ఈ ప్రాంతంలోని మద్యం దుకాణాల సంఖ్యను నియంత్రించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐతో అందరికీ చేరువగా నాణ్యమైన విద్య

మద్దిలపాలెం: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో అట్టడుగు వర్గాలకు సైతం నాణ్యమైన విద్య చేరువవుతుందని ఆంధ్రా యూనివర్సిటీ డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చైర్ ప్రొఫెసర్ ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) భువనేశ్వర్‌లో 'ఏఐ అండ్ అడాప్టివ్ లెర్నింగ్ ఇన్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్' అనే అంశంపై జరుగుతున్న సదస్సులో గురువారం జేమ్స్ స్టీఫెన్ రెండు ప్రత్యేక ప్రసంగాలిచ్చారు. డిజిటల్ సాంకేతికత ఫలితంగా బి.ఆర్.అంబేడ్కర్ ఆశించిన సామాజిక న్యాయం సాకారమవుతుందని పేర్కొన్నారు. విద్యా రంగంలోని సమస్యలకు పరిష్కారం చూపుతూ, సాంకేతికతను అనుసంధానం చేస్తూ సమానత్వాన్ని సాధించే విషయాలు, జరిగే ప్రయత్నాన్ని తెలియజేశారు. ప్రత్యేక అవసరాలు గల వారికి, అట్టడుగు వర్గాల వారికి విద్యను ఆధునిక సాంకేతిక విధానాలతో ఏ విధంగా చేరువ చేయవచ్చో వివరించారు. ఏఐ బోధనలో ఉపయోగించే విధానాలపై అధ్యాపకులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ)లో భాగంగా ఐఐటీ భువనేశ్వర్‌లోని హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 27 వరకు ఉపన్యాసాలు జరుగుతాయని తెలిపారు.